సూశావా సిన్నీ, మారాజులు కార్లల్లో పోతారు. మనబోటిగాళ్ళు హాయిగా నడిచిపోతారు. ఈ నడమంత్రం మా రాజులే మన్ని పోసిత్తారు, తెలుసా. అందుకే ఆరిని మనం, మన్ని ఆరూ, యిలా దగాసేసుకుంటాం...

సిన్ని (ఆవులించి) నిద్దరోత్తోందా—సలేత్తం దిరో...నువ్వురా జానీ.

జా: ఏమి జలమంబేమి జీవనమూ,
ఏమి జలమంబేమి శాశ్వత
మేమి నా ప్రారుద్ధ ఖర్మం
ఏమి జలమంబేమి జీవనమూ.

నా రాజా, సోవులూ, నిద్రపో. తెలివొచ్చాక మళ్ళీ మువ్వ వాయిద్దుగాని!

(ఆలిండియా రేడియో ప్రసారితం)

---

స్కెచ్

# ఒక నీతివంతుడి కథ

సిద్ధాంతి మల్లికార్జునం

గడచినకాలాన్ని నెమరువేసుకుంటూండగా నా మనోవీథిలో రఘురామయ్యగారు సాక్షాత్కరించారు. వీరితో నాకు పరిచయం కలిగింది నా విద్యార్థి జీవితంలోనే. అప్పుడు నేను నెల్లూర్లో యింటర్‌మీడియట్ క్లాసులో చదువుకుంటూ ఓ పేదరాసి పెద్దమ్మ యింట్లో భోంచేస్తూండేవాణ్ణి. పాపం, ఆ పెద్దమ్మ నన్ను అచ్చంగా కన్నకొడుకులా చూసుకుంటూండేది. అందుచేత, నేను ఆ వూళ్ళో చదువుకున్నన్నాళ్ళూ ఆవిడ దగ్గరే భోంచేశాను. ఆవిడ దగ్గర భోంచేసేవాళ్ళందర్నీ ఆవిడ చాలా జాగ్రత్తగా చూచుకుంటూండేది. కావలసినవాళ్ళకు మడితో చేసిపెట్టేది. పత్యాలు చేసిపెట్టేది. అచ్చంగా ఆవిడ తెలుగు భోజనం పెట్టడంచేత అరవసోదరుల చప్పిడి భోజనంచేసి నోరు చవిచెడిన వారందరూ మా పెద్దమ్మ నాశ్రయించేవారు. పైగా నెయ్యి సుమారుగా వడ్డిస్తుందన్న పేరొకటి ఆవిడ సంపాదించుకొన్నది. ఇవన్నీ చూచి రఘురామయ్యగారు శాశ్వతంగా ఆవిడదగ్గరే భోజనానికి ఏర్పాటు చేసుకున్నారు.

రఘురామయ్యగారికి దాదాపు డెబ్భైసంవత్సరాల వయస్సుంటుంది. అయినా శరీరదారుఢ్యం ఏమీ సడలిపోలేదు. ఆయన్ని చూచినప్పుడల్లా 'ఆజానుబాహు వరవింద దళాయతాక్షః' అన్న సంస్కృతశ్లోకం మానసవీధిలో మెరుస్తూంటుంది. ఆయన విష్ణుభక్తుడు. ఆ విషయం ఒకటిన్నర మైలు నుంచే యెవరైనా తెలుసుకోవచ్చు. తెల్లవారు ఝామునేలేచి డిసెంబరు మాసంలో కూడా చన్నీళ్ళ స్నానం చేస్తాడు. అప్పుడాయన్ని చూస్తూంటేనే నా శరీరం చలితో కొయ్యబారిపొయ్యేది. ఈసంగతి ఆయనతో చెబితే, "ఒక్కో అర్థాయిస్సు కుంకలు" అనేవాడు. ఏమిటోగాని ఆయన ఆమాట అంటూంటే నాకుచాలా సంతోషంగా వుండేది.

ఆయన జపానికి కూర్చుంటే కనీసం రెండు గంటలైనా పట్టేది లేవటానికి. ఈ రెండు గంటలసేపు, యింటికప్పు ఎగిరిపొయ్యేలా చదువుతూండేవాడు. చుట్టుపక్కలవాళ్ళకు నిద్రాభంగమన్న విషయం ఆయన బుర్రలోకి చేరలేదు, చేరదు. ఎవరైనాకాస్త ఆక్షేపిస్తే "భగవన్నామం స్మరించుకోడం కూడా నేరమైతే ఎట్లాగురా అబ్బాయి" అని ఎదటివాళ్ళని నోరు మూయించేవాడు. ఏది ఎలాగున్నా ఆయన దీక్షమాత్రం కొనియాడదగ్గదే. ఆమాత్రం దీక్షతో ప్రతిరోజూ పాఠాలు చదువుకోగలిగితే యూనివర్సిటీలో ప్రథమశ్రేణిలో పరీక్ష ప్యాసై వుండేవాణ్ణి గదానని అప్పుడూ ఇప్పుడూకూడా నాకనిపిస్తూంటుంది.

మా పెద్దమ్మ రఘురామయ్యగారికి స్పెషల్ కాఫీ తయారుచేసిచ్చేది. ఆయన బజారుకెళ్ళి అయిదారు అంగళ్ళలో కాఫీ గింజల టోకు ధర విచారించి సవాశేరు గింజలు కొనుక్కొచ్చి మా పెద్దమ్మకిస్తే ఆమె తలకు స్నానంచేసి తడి గుడ్డలతో వాటిని వేయించి పొడిగొట్టి డబ్బాలో పోసి ఊరగాయల జాడీలమధ్య జాగ్రతగా దాచిపెట్టి ప్రతిరోజూ మడినీళ్ళతో డికాక్షన్

తయారు చేసి పాలుకలిపి రఘురామయ్య, సంధ్యావందనం, లలితా సహస్రనామం, ఆదిత్యహృదయం ఆమూలాగ్రం పారాయణం చేసినమీదట, పొగలు కక్కుతూండగా అందించేది. నాబోటి సామాన్యుల కది కాఫీయేగాని రఘురామయ్యగారి దృష్టిలో అది 'అమృతం'. వారెప్పుడైనా సరే. 'కాఫీ' అనరు. 'అమృతమ'నే వ్యవహరిస్తూంటూరు.

కాఫీ తాగి అరగంటసేపు తిరుచూర్ణం బాగా కలిపి నామం పెట్టుకొని, రుద్రాక్షతావళం తీసి బుట్టలో జాగ్రతగా పెట్టి గూట్లో దాచేవాడు. తర్వాత వస్త్రధారణచేసి బయలుదేరేవాడు.

మా పెద్దమ్మకు ఆయనమీద ఎడతెగనిభక్తి. సనాతన ధర్మానికి పట్టుగొమ్మ ఆయనేనని ఆమె అభిప్రాయపడుతూండేది. ఆ అభిప్రాయమలా వుండగా యీమాత్రం వర్షాలైనా ఆయన ధర్మ నిర్వహణవల్లనే కురుస్తున్నాయని, రాయలసీమలో కరువుకాటకాలింకా ఉధృతంగా రాకుండా అంతమాత్రంలోనే నిలబడిపొయ్యాయని, మా పెద్దమ్మ గట్టిగా నమ్మేది. ఆ నమ్మకంలో కొరవ లేమాత్రం లేవు. అగ్నిసాక్షిగా పెళ్ళాడి ప్రేమించే అర్థాంగికూడా అంతభక్తిగా వుండలేదు. ఎలాగూ కట్టుకున్నాం. యీజన్మానికింతే. కష్టమో సుఖమో తప్పదు అనుకుంటూ తాలూకా ఫీసుగుమాస్తాలాగా తనవిధిని నిర్వహిస్తుందేగాని, గృహిణికి గాఢభక్తి ఎలాకలుగుతుంది? మా పెద్దమ్మకు ఆయన సర్వకాలాల్లోను, మహావిష్ణువులాగు కనుపించేవాడు. ఏ సినిమా డైరెక్టరూ రఘురామయ్యజోలికి పోలేదుగాని, పోయేవుంటే యీవరకు రఘురామయ్య మహావిష్ణువుపాత్ర ధరించి, అర్థానికి అర్థము, పలుకుబడి, భక్తకోటిని సంపారించి వుండేవాడు. ఆయన విగ్రహం అలాంటిది!

ఒకనాడు పెద్దమ్మకూ నాకూ ఆయనవిషయంలో కాస్తసంభాషణ జరిగింది.

"అవ్వగారూ" అన్నాను. ఆదివారంనాడు మధ్యాహ్నం భోంచేస్తూ. పెద్దమ్మ అని చెప్పుకుంటూన్నా ఆమెను అవ్వగారనే పిలుస్తూండేవాణ్ణి.

"ఏంనాయనా" అన్నది.

"రఘురామయ్యగారేరీ?" అన్నాను.

"ఎవరో రెడ్డిగారొచ్చి వూరికి పిల్చుకుపొయ్యారు" అన్నది.

"అసలాయనకేం పనండీ?"

"ఏమిటో నాయనా కోర్టుదగ్గర పనట."

"గుమాస్తానా?" అన్నాను.

"కాదయ్యా, ప్లీడర్లతో ఏవేవో మాట్లాడుతూంటాడట."

"ఓహో, చెట్టుకింది ప్లీడరా?"

"ఏబండలో నాకేం తెలుసు" అన్నదినవ్వుతూ.

"అయితే, చెట్టుక్రింద ప్లీడర్లుకూడా వుంటారా నాయనా?" అంటూ ప్రశ్నించింది.

"ఆ! చాలామంది."

"వాళ్లూ ప్లీడరు పరీక్ష ప్యాసైనవారేనా?"

"అబ్బే! ఏమీ అక్కర్లేదు. వాళ్ళకూ వీళ్ళకూ తగాదాలు పెట్టటం నేర్చిస్తే చాలు."

"అందుకోసం ప్లీడర్లు కొంతమందా?"

"అవును. అసలు వీళ్లులేకపోతే కోర్టులుండవు, మునసబులుండరు, జడ్జీలుండరు, ఏమీ వుండవు."

"వీళ్ళు అంతగొప్పవాళ్ళన్నమాట."

"అవును. చూడు మన రఘురామయ్యగారెంత గొప్పవారో."

"నిజమేనబ్బాయ్. పొద్దున లేస్తే ఎంతమంది ఆయనచుట్టూ తిరిగిపోతూంటారో చూడు. గొప్పగొప్ప రెడ్లుకూడా ఆయనకోసం మనింటికి వస్తూ పోతూంటారు. ఆయన వాళ్ళందర్నీ గంటలకొద్దీ కూచోబెట్టి ఎన్నెన్ని సలహాలో చెబుతూంటారు."

"డబ్బిస్తూంటారా?"

"అయ్యో! డబ్బుకేం... ఆయన పాదాలదగ్గర కుమ్మరించిపోతారు."

"అయినా మీరు చాలా అదృష్టవంతులండీ."

"ఏంనాయనా?"

"కాకపోతే, రఘురామయ్యలాంటి గొప్పవ్యక్తి, భక్తుడు, ఆచారవంతుడు, ధనికుడు - మీ చేతి అన్నంతింటాడుగదా!"

"ఏదోనాయనా, నాచేతనైనమటుకు చేసిపెడుతున్నా."

"ఆయనకి పిల్లలులేరా?"

"ఉన్నారు... కాయనకి సరిపడదు వాళ్లంటే."

"ఏం?"

"ఏముంది. ఓ ఆచారమా, బండలా ఏదో ఓ కూడుతింటారు. మడిలేదు, నా మొహంలేదు."

"పోనీ భార్య వుందిగా."

"అయ్యో నారాతా, ఆ యిల్లా లంటే యీ అవస్థ దేనికి ఆ బ్రాహ్మడికి?" "పాపం"అన్నాను అప్రయత్నంగా. భోజనమైపోయింది.

రఘురామయ్యగారి సంగతి విన్నమీదట అతనితో బాగా పరిచయం చేసుకోవా లనిపించింది నాకు. మరునాడే ఆయన భక్తుణ్ణి అయిపోయ్యాను. నన్ను బాగా చేరదీసి చిన్నచిన్న పనులు నాచేత చేయించుకోడం మొదలెట్టాడు. కాలం జరిగేకొద్దీ నామీద ఆయనకు వాత్సల్యం ఎక్కువైంది. నన్ను పిల్చేటప్పుడల్లా అతని కంఠంలో ఆ వాత్సల్యం వ్యక్తమయ్యేది. కంఠంలో మార్దవం, చూపుల్లో చల్లదనం, మాటల్లో ఆప్యాయం నాకు గోచరించేవి. "అబ్బాయ్!" అంటూ నన్ను సంబోధించేవాడు. కొన్నాళ్ళకు నామీద ఆయనకు పుత్రవాత్సల్యం కలిగినట్టుగా తెలుసుకున్నాను.

ఈమధ్య అత్యవసరమైనవీ, రహస్యాలైనవీ ఏవైనా విషయాలు మాట్లాడేటప్పుడు, నన్ను దగ్గరుంచుకోటానికి కతడు వెనకాడటం లేదు. అందుచేత రోజురోజుకూ ఆయన రహస్యాలన్నీ నాకు తెలిసి వస్తూండేవి. ఒకనాడు ఆయనకూ ఓ రెడ్డికీ జరిగిన సంభాషణవల్ల రఘురామయ్యగారు "ఫోర్జరీ"లో అందవేసిన చెయ్యని గ్రహించగలిగాను. నిజంగా యీ విషయం నేను భరించనిదైంది. అది విన్నతర్వాత అతనిమీద ఏర్పడ్డ సదభిప్రాయాలన్నీ తిరుగుమొహం పట్టాయి. యువకరక్తం నా నాడుల్లో ప్రవహించడంవల్ల అతని చర్యలని గర్హించాను. అతను ఒట్టి బూటకపు మనిషని, అతన్ని ద్వేషించడం మొదలెట్టాను.

ఓనాడు వుండబట్టలేక అడిగేశాను రఘురామయ్యగారిని:

"అయితే మీరు ఫోర్జరీలు చేస్తారా?" అన్నాను.

నవ్వాడు, చుట్ట నోట్లోంచి తీసి ఝమ్మేసి, "ఏం?"అన్నాడు.

"ఏమీలేదు. ఊరికినే అడిగాను"అన్నాను.

"అవును అబ్బాయి. నావృత్తి అదే"అన్నాడతను నిశ్చలమైన దృక్కులతో.

"ఆ పని నేరంకదూ?"అన్నాను.

మళ్ళీ గుర్రం సకిలించినట్లు నవ్వాడు.

"అనుకుంటే అన్నీ నేరమే. ఈ ప్రపంచంలో నేరంచెయ్యనివాళ్లెవరో చెప్పు?" ఆయనలా అనేసరికి నేనేమీ మాట్లాడలేకపోయాను.

"నేరంచేసేవాడిదికాదు తప్పు. అసలు నేరస్థుడు వాడుకానేకాదు. వాడిచేత నేరంచేయించేవాళ్ళది. నాచేత యీ నేరం చేయించి లాభపడి, అనుభవించేవాళ్లకన్నా నేరస్థులెవరునాయనా?" అని వాదించాడు. ఈయనగారు ఇంగ్లీషు చదువుకొనుంటే దేశానికి పన్నెతెచ్చే న్యాయవాది అయివుండేవా డనిపించింది. నేను బదులు ఏమని చెప్పాలో తోచలేదు.

"అయితే వాళ్ళ లాభాలకోసం మీరు నేరం చేస్తున్నారా?"అన్నాను.

"నేను చేసేది నేరమని నేననుకోడంలేదు. ఇతరులు ఎన్నోవిధాలు విమర్శిస్తూంటారు. కాని వాళ్ళ నేరాలువాళ్ళకు తెలుసా?"అన్నాడు చుట్టపొగ వదులుతూ.

"మరి కోర్టులో ఫోర్జరీ చేశారన్న నేరంమీద కేసులుపెట్టి కొంతమందికి శిక్ష విధిస్తున్నారు గదండీ"అన్నాను.

"అసలు కోర్టులకి తలకాయలేదు. ఏదో ఒక తగాదాకావాలి కోర్టుకి. అందుకోసం, ప్రతిదీ ఒక నేరంకిందనే భావించి శిక్షిస్తూంటుంది. చూడు నాయనా, రేషన్‌వుందికదా యిప్పుడు. లారీల్లో వేలకొలదీపుట్లు దొంగతనంగా రవాణా అవుతున్నాయికదా, అది నేరంకాదా?...ఎవతో ఒక దిక్కులేనిముసిలిది శేరుబియ్యం సంచిలోపట్టుకెళ్లు తుంటే దాన్నితీసికెళ్ళి శిక్షవిధిస్తాయి కోర్టులు కదా! ఇక నేరం ఏది, నేరస్థులెవరు? ఖూనీచేసిన వాణ్ణి, కాస్త పాత ఇంగ్లీషు చట్టాలన్నీ చూచి సాక్ష్యం దొరకలేదని, గాడిదగుడ్డు దొరకలేదని వదిలేస్తాయి కోర్టులు. ఏపాపం ఎరగనివాణ్ణి శిక్షిస్తాయి... ఇలాంటి కోర్టులకు తలకాయ వుందంటావా?" అని గుక్కతిప్పుకోకుండా ఉపన్యసించాడు. అప్పటితో అతడితో వాదించటం వృథ

యోగంలేదని, పాటించలేనని తీర్మానించుకున్నాను.

"అదంతా అలా పోనివ్వండి. మీరు చేసేపని నైతికంగా మంచిదేనా?" అన్నాను.

కాసేపు ఆగేడు. ఇంతలో చుట్ట పూర్తిగా కాలిపోయింది. దాన్ని అవతల పారేసి నన్ను చూచి చిరునవ్వు నవ్వాడు.

"నీవు లోకజ్ఞానం లేనివాడివోయ్. జీవితంలో లోతుపాతులు నీకింకా తెలీవు. మీబళ్ళలో ఎంతసేపటికీ సన్మార్గంగా ప్రవర్తించమనే బోధిస్తూంటారు. అందుచేత యిలాంటి చిన్నచిన్న విషయాలన్నీ నేరాలుగాను, నీతిబాహ్యమైనవిగా మీకు కనుపిస్తూంటాయి. కాలేజీదాటి వాస్తవిక ప్రపంచంలో పడితే నీ ఆదర్శాలన్నీ గాలికెగిరిపోతై. లేకపోతే నీవు యీ ప్రపంచంలో బ్రతకలేవు. అసలు నిన్ను నీతిగా బతకనిచ్చేవాడేడీ? నేను నలభైఏళ్లు వచ్చేవరకూ నీలాగే సన్మార్గంలోనే నడిచాను. కాని తర్వాత నాచేతకాకపోయింది. నా బిడ్డలు నన్ను దూరంచేశారు, వారికేమీ ఆస్థి సంపాదించి పెట్టలేదని. నాభార్య చనిపోయింది. మా ఊరిలో వుండలేక వైపంచతో యీ వూరికొచ్చి పడ్డాను. ఓ పదేళ్లు ప్లీడరు గుమాస్తాగా పని చేసి, తర్వాత చెట్టుకింద ప్లీడరయ్యాను. ఇప్పుడు నాకు డెబ్భైఏళ్లు. ఈ ముప్ఫసంవత్సరాలనుంచి ఎన్నెన్నో అగచాట్లు పడుతూ కాలం గడుపుతున్నాను.

ఇప్పుడు నా తిండి నేను సంపాదించుకొని సుఖంగా బతుకుతున్నాను. ఎవడైనా పదిరూపాయిలు సంపాదిస్తే యీలోకం వాణ్ణి ఆడిపోస్తుంది అవినీతిపరుడని. ఏమీ సంపాదించ లేకపోతే దరిద్రుడని నిరసిస్తుంది.

"అయితే మీరు ఎన్నెన్నో పారాయణాలు చేస్తూంటారుగా యీ పాడుపనెందుకు చేస్తారు?"

"ఇది పాడుపనని నీవు భావిస్తున్నావు. ఏదైనా ఒకళ్ళమోచేతికింది నీళ్లుతాగి బతకడంకన్న మంచిదేగా? లోకంలో రాజకీయజ్ఞులు, ప్లీడర్లు వ్యాపారస్తులు, ఏంచేస్తున్నారు నాయనా? వాళ్ళందరూ సత్యసంధులా? వాళ్ళు చేసేవి నీతి బాహ్య పనులు కావా? నాకు నీతులు చెప్పినవాళ్ళందరూ కొంపల్లో ఎంతసేపు భగవద్గీత పారాయణాలు చేస్తున్నారో...అది వేరు. మనం మానవులం. మనకు తెలుసు. దొంగకూడా దేవుణ్ణి ప్రార్థిస్తాడు. దేవుణ్ణి పూజించటం ప్రతివాడికీ తప్పని సరి, అది వాడివిధి. జన్మహక్కు. దేవుణ్ణి పూజించుకోడానికీ, స్మరించుకోడానికి లౌక్య వ్యవహారాలకు సంబంధంలేదు. ఒకటి పారమార్థికం, మరొకటి ఐహికం...గొప్ప నీతిమంతుణ్ణి లోకం కన్నెత్తి చూడనే చూడదు...నాయనా, ఇవన్నీ అనుభవం మీద అర్థం అవుతాయిగాని వూరికే ఇంగ్లీషు పుస్తకాలు చదివితే అర్థమౌతాయా?... నేను నీతిపరుణ్ణో, అవినీతిపరుణ్ణో ఆ భగవంతుడే నిర్ణయిస్తాడు. కాని నన్ను కోరినవాడికి చేతనైనంత వరకు సహాయపడటమే నాపని. నావల్ల సుఖపడే వాళ్లుకూడా వున్నారన్న తృప్తి నాకు చాలు. రెండుపూటలా కడుపునిండా భోజనం, కట్టుకోను మామూలు గుడ్డ ప్రతివారికి సంపాదించి పెట్టగలిగిన పనే నీతిగలపని" అంటూ సాయంకాలం సంధ్యావందనానికి వెళ్ళాడు.

---

ఇటీవల మద్రాసునుంచి వచ్చే ఒక సచిత్ర వారపత్రికలో ఒక గేయం ప్రకటించబడింది. దాని పేరు "శాంతించుతల్లీ శాంతించు" గోదావరి జలప్రళయాన్నిగూర్చి ఆ గేయంలో కవి తన ఆవేదనను ఈ విధంగా వెళ్లబుచ్చాడు.

"ఎందుకమ్మా గోదావరీ, ఇంత ఆగ్రహం? ఎందుకమ్మా తల్లీ ఇంత ఉగ్రస్వరూపం ఊరూనాడూ ఏకంచేశావే!
పల్లే పట్నం పాడుచేశావే! నిండు ప్రాణాలను నిలువునా కూల్చావే! నీ కన్నబిడ్డలను నిరాశ్రయులనుచేశావే!"

అని ప్రారంభంచేసి "ఏం చేశామమ్మా మేము, ఏం చేశాము.......ఏం మునిగిపోయిందని ఇంత విరుచుకుపడ్డావు"అని మధ్యలో కొంచెం కోప్పడి "ఇంకైనా శాంతించు తల్లీ.... ఈ విశ్వరూపాన్ని ఇంకైనా ఉపసంహరించుకో జననీ"అని ప్రాధేయపడటం జరిగి గేయం ముగుస్తుంది. ఈ గేయాన్ని చదివి వరద బాధితుడు ఏవిధంగా అనుకుంటాడో చెప్పలేంగానీ, వరద బాధితుల్ని గూర్చి బాధపడే బాధితులకు మాత్రం నవ్వొస్తుంది. ప్రాణంపోయి చస్తుంటే మధ్యన ఈ వెర్రికవిత్వం ఏమిటని ఒళ్లు మండుకొస్తుంది. ఏదైతేనేంగానీ. ఇంతకీ చెప్పుకోతగ్గవిషయం ఏమంటే ఆంధ్రదేశానికి ఎన్ని ఉపద్రవాలు వచ్చినా ఈరకమైన వెర్రికవిత్వానికి మాత్రం ఉపద్రవం రావటంలేదు.("ప్రజావాణి"లో అయస్కాంతరావు.)